మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న కొంగరకలాన్ బీఆర్ఎస్ నాయకులు

ఆదిబట్ల, మే 21: ఈ నెల 24 ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మంగళవారం కొంగరకలాన్ గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం స్వామి వారి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించాలని కోరారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కల్యకోలు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వనం శ్రీను, మహేందర్, రవీందర్, కృపాకర్, ముక్కెర నారాయణ, ప్రవీణ్‌తో పాటు నాయకులు ఉన్నారు.

మైనింగ్ అనుమతులను నిలిపివేయాలి

- జడ్పీటీసీ దశరథ్‌నాయక్

సమావేశంలో మైనింగ్ అనుమతులపై మాట్లాడుతున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మే 21 : మండల పరిధిలోని ముద్విన్ గ్రామ సమీపంలోని నల్లగుట్టల వద్ద మైనింగ్ అనుమతులను నిలిపివేయాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి స్టాండింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్విన్ గ్రామ సర్వే నంబర్ 95లో నల్లగుట్టల వద్ద మైనింగ్ ఏర్పాటుకు, గతేడాది గ్రామంలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో మైనింగ్ ఏర్పాటుకు అనుమతులు నిలిపివేయాలని గ్రామస్తులంతా తీర్మానం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మైనింగ్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సంబంధింత శాఖ ఏడీ పేర్కొన్నట్లు జడ్పీటీసీ తెలిపారు. అదే విధంగా ఆమనగల్లు నుంచి ముద్విన్, మేడిపల్లి గ్రామాల మీదుగా మాల్ వరకు ఆర్టీసీ బస్సును నడపాలని అధికారులను కోరినట్లు ఆయన వివరించారు.

కమిషనర్ సారూ.. కంపు కనరా!

పెద్దఅంబర్‌పేట, మే 21: తట్టిఅన్నారంలోని ప్రధాన రహదారిపై, వైఎస్సార్ నగర్‌కు వెళ్లే దారంతా కంపుకొడుతున్నది. చిన్నపాటి వర్షం వచ్చినా మురుగు రోడ్డుపైనే పారుతున్నది. వాహన రద్దీ అధికంగా ఉండటంతో వెనకాల వచ్చే వాహనదారులకు మురుగు పడుతూ కంపు కొడుతున్నది. ఇక కాలినడకన వచ్చే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ సమీపంలోని దుకాణదారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నిల్వకుండా గతంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసినా.. ప్రస్తుతం మళ్లీ పాత పరిస్థితే నెలకొన్నది. మున్సిపల్ కమిషనర్ ఇక్కడ పరిస్థితిని పరిశీలించి, కంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

కడ్తాల్, మే 21 : మండల కేంద్రంలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేశారు. అనంతరం వివిధ దవాఖానల్లోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

50 కిలోల బియ్యం అందజేత.

ఆమనగల్లు : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని నిరుపేదరాలైన రాములమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనురాధ, నాయకులు చలిచీమల సతీశ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, నాయకులు శ్రీను, వెంకటయ్య, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

నర్సరీ మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే21: వేసవిలో నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో మంగళవారం నర్సరీ మొక్కలను పరిశీలించారు. మొక్కల పెంపకం తీరుపై ఆయన ఆరా తీశారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండిపోయిన మొక్క స్థానంలో మరో మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులను పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేదిలేదన్నారు. ఈజీఎస్ ఏపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి అదృశ్యం

సుజిత్‌దాస్ (ఫైల్)

కొత్తూరు, మే 21: ఓ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి అదృశ్యమైన ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి సుజిత్‌దాస్ (28) ఈ నెల 19న సాయంత్రం 7 గంటల సమమంలో బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో సుజిత్‌దాస్ రూమ్‌మేట్ దిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

- మండల ఉద్యానవన శాఖ అధికారిణి సౌమ్య
- మండలాల్లో అవగాహన సదస్సులు

కడ్తాల్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మండల ఉద్యానవన శాఖ అధికారిణి సౌమ్య

కడ్తాల్, మే 21 : ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానవన శాఖ అధికారిణి సౌమ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మక్తమాదారం గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వసతి ఉన్న వ్యవసాయ పొలాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయవచ్చని, ఈ పంటకు చీడ పురుగుల బెడద చాలా తక్కువని తెలిపారు. ఎకరా సాగులో 8 నుంచి 10 టన్నుల పంట దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. మొక్కలకు 90 శాతం, డ్రిప్ ఇరిగేషన్ 80 నుంచి 100 శాతం సబ్సిడీని ఇవ్వడంతో పాటు, మొక్కలు నాటినప్పటి నుంచి నాలుగు ఏండ్ల వరకు ఎకరానికి పంట నిర్వహణ ఖర్చు రూ.4,200 అందజేయనున్నట్లు తెలిపారు. వాల్యూ ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు మండలానికి ఫీల్డ్ ఆఫీసర్, ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి, నిరంతరం పంట పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రమణ, ఫీల్డ్ ఆఫీసర్ హిమ్మకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ పాల్గొన్నారు.

మంచాల : ఆయిల్‌పామ్ పంట సాగు చేసుకున్న రైతులకు అవగాహన కల్పిస్తున్న కనకలక్ష్మి

అధిక ఆదాయం

మంచాల : ఆయిల్‌పామ్ సాగుచేసుకున్న ప్రతి రైతుకు అధిక దిగుబడితో పాటు రెట్టింపు ఆదాయం వస్తుందని ఉద్యానవన శాఖ అధికారిణి కనకలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగు చేసుకున్న రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వసతి కలిగి ఉన్న రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేసుకొని లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ, డీజీఎం రాంమోహన్‌రావు, ఉద్యాన శాఖ ఏడీఏపీ వెంకటేశ్వర్లు, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ వికాస్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

వెంకమ్మగూడలో ఎల్లమ్మ తల్లి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

నందిగామ, మే 21 : నందిగామ మండలం వెంకమ్మగూడ, అంతిరెడ్డిగూడ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, చేగూర్ పీఏసీఎస్ చైర్మన్ గోర్లపల్లి అశోక్, ఎంపీటీసీలు కొమ్మ కృష్ణ, దేపల్లి కుమారస్వామిగౌడ్ తదితరులు హాజరయ్యారు.

పుస్తె మెట్టెలు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మే 21 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉండే సురేఖ నిరుపేదరాలు. భర్తను కోల్పోయి పేదరికంలో జీవిస్తున్నది. తన కుమార్తెకు వివాహం కుదరడంతో సురక్ష సేవా సంఘాన్ని సాయం అందించాలని కోరింది. వెంటనే స్పందించిన సురక్ష సేవా సంఘం సభ్యులు మంగళవారం కుటుంబానికి పుస్తె మెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కిక్కెర గోపిశంకర్‌యాదవ్, సంభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేస్తున్న సురక్ష సేవా సంఘం ప్రతినిధులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్‌టౌన్, మే 21: షాద్‌నగర్ సబ్‌స్టేషన్ 220/132/33కేవీ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని అన్ని కాలనీలతో పాటు సోలిపూర్, సాయిబాలాజీ, ఫరూఖ్‌నగర్, నాగులపల్లి, రాసుమల్లగూడ, నందిగామ మండలంలోని మామిడిపల్లి, వీర్లపల్లి, మోత్కులగూడ, మొదల్లగూడ, ఈదులపల్లి, కిషన్‌నగర్, హాజిపల్లి, చించోడ్, దేవునిపల్లి, చౌలపల్లి, విఠ్యాల, కంసాన్‌పల్లి, పీర్లగూడ, మొండోనిరాయితండా, ఉప్పరిగడ్డ, పలుగుట్టతండాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి అందరూ సహకరించాలని కోరారు.

యాచారం : విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించే పనిలో భాగంగా మండలంలోని మంథన్‌గౌరెల్లి, చింతపట్ల గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథన్‌గౌరెల్లి, చింతపట్ల గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆమనగల్లు : ఆకుతోటపల్లి, కాటన్‌మిల్, విఠాయిపల్లితో పాటు ఇండస్ట్రీస్‌కు ఉదయం 9.00 నుంచి 1.00 వరకు అదే విధంగా మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు మూర్తూజపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళవారం ఏఈ సీతారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకుతోటపల్లి 33 కేవీ,11 కేవీ ఫీడర్, 11 కేవీ కాటన్‌మిల్, విఠాయిపల్లి, అదేవిధంగా మూర్తూజపల్లి 11కేవీలో లైన్లలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం

పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్

కడ్తాల్, మే 21 : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీలోని బోయిన్‌గుట్ట తండాకి చెందిన చినావత్ శంకర్ మృతి చెందాడు. మంగళవారం ఉదయం జడ్పీటీసీ స్థానిక నాయకులతో కలిసి శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన కేశని జంగయ్య హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి బాధితుడిని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశాడు.

తాటి, ఈత చెట్లను నరికితే కఠిన చర్యలు

ఆమనగల్లు, మే 21: అనుమతి లేకుండా తాటి, ఈత చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండలాల్లో అనుమతి లేకుండా ఈత, తాటి చెట్లను నరికివేస్తే, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామాని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై ఇటీవల సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో గీత కార్మికులు, రైతులు, రియల్ వ్యాపారులకు అవగాహన కల్పించినట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ఆదిబట్ల, మే 21 : అనుమతులకు మించి అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని మంంగల్‌పల్లి, ఆదిబట్ల టీసీఎస్ సమీపంలోని కొంత మందికి నోటీసులు కూడా అందించామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

చింతపట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

యాచారం, మే21: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చింతపట్ల గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. ఉపాధి కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపిస్తుందన్నారు. కొన్ని వారాలుగా పనులు చేసినా వారికి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్యూబిక్ మీటర్ రేటును పెంచి, కొలతలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయ తరలింపు సరికాదు



బాలాపూర్‌లో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

బడంగ్‌పేట, మే21: బాలాపూర్ లో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేటకు తరలించిన పాపం కాంగ్రెస్ పార్టీ దేనని బాలాపూర్ అఖిల పక్ష నాయకులు ఆరోపించారు. మంగళవారం బాలాపూర్ పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల పక్ష నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో బాలాపూర్‌కు మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మీర్‌పేటకు తరలించారన్నారు. బాలాపూర్‌కు వచ్చిన పోలీస్ స్టేషన్ ను మల్లాపూర్‌కు తరలించారన్నారు. బాలాపూర్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇతర ప్రాంతాలకు తరలించి బాలాపూర్ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని వాపోయారు. బాలాపూర్ గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయం గురించి నోరు మెదపక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాలాపూర్ ప్రజా ప్రతినిధులకు ఓట్ల తర్వాత పైసలు తప్ప ప్రజల సమస్యలు పట్టవన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే కండ్లులేని కబోదులుగా బాలాపూర్ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్నారు. బాలాపూర్‌కు సంబంధించిన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉండి ఎందుకు ఖండించలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పలేదో వారు సమాధానం చెప్పాలన్నారు. కార్పొరేషన్‌లో తీర్మానం చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా కార్యాలయాన్ని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. బాలాపూర్ ప్రజా ప్రతినిధులు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు కొలన్ శంకర్ రెడ్డి, (బీజేపీ) బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి,(బీఆర్ఎస్)బడంగ్‌పేట కోఆప్షన్ సభ్యులు రఘునందన చారి, రజక సంఘం నాయకులు బాలారాజ్, గడ్డం వెంకటేశ్, అత్తాపూర్ శ్రీనివాస్ రెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, దొడ్డి శ్రీశైలం, తిమ్మని గిరీశ్, గుండె నాగార్జున, విజయ్, అరవింద్ కుమార్, ఎమార్పీఎస్ నాయకులు నర్సింహ, కృష్ణ, బొర్ర రవి, తదితరులు పాల్గొన్నారు.

31 ఫోన్లు రికవరీ

వనస్థలిపురం, మే 21 : చోరీకి గురైన 31సెల్ ఫోన్‌లను రికవరీ చేసిన వనస్థలిపురం పోలీసులు మంగళవారం బాధితులకు అందజేశారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు చోట్ల జరిగిన సంఘటనల్లో ఫోన్‌లు పోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఫోన్‌లు ఎంతో కీలకంగా మారాయన్నారు. సమాచార వ్యవస్థతోపాటు వ్యక్తిగత సమాచారం కూడా అందులో ఉంటుందన్నారు. జనం ఎక్కువగా ఉండే చోట ఫోన్ చోరీలకు గురవుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్లను రికవరీ చేసిన వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి, డీఐ, ఎస్ఐలను ఏసీపీ అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న బంధు మిత్రులు

యాచారం, మే 21: మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన యార యాదగిరి గున్‌గల్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబానికి బంధుమిత్రులు అండగా నిలిచారు. రూ.2,46,700 నగదును మంగళవారం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచిన అందరికీ మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను విస్మరించిన రేవంత్ సర్కార్

- రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి

యాచారం, మే 21 : అధికారంలోకి రాకముందు వడ్లకు రూ.500ల బోనస్ ఇస్తానన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్న బియ్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటని రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడంతో దొడ్డు వడ్లు పండించిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని కేవలం 10శాతం మాత్రమే సన్న వడ్లు పండిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సన్నవడ్లకు ఇచ్చే బోనస్ కంటే ప్రైవేటు రైస్ మిల్లుల్లోనే ఎక్కువ బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు బోనస్‌ను వదిలి ప్రభుత్వ బోనస్ కోసం రైతులు ప్రభుత్వానికి అమ్ముకోరని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన బోనస్ హామీని సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని ఆయన మండిపడ్డారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల దగ్గర ఉన్న ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన కోరారు. తడిసిన వడ్లను సైతం కొనుగోలు చేసి రైతులకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం తగిన నష్ట పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు ఎక్కడ అన్యాయం జరిగినా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్ఐ బలరాంనాయక్

ఆమనగల్లు, మే 21: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని ఆమనగల్లు ఎస్సై బలరాం నాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని జరిమానా విధిస్తామని వాహనదారులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలన్నారు.

యాచకుడి మృతి

పెద్దఅంబర్‌పేట, మే 21 : అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విజయవాడ జాతీయ రహదారిపై యాచకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో దాదాపు 70 ఏండ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. బ్రిలియంట్ కాలేజీ కమాన్ సమీపంలో మృతిచెంది ఉన్నట్టు మంగళవారం అందిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించినట్లు తెలిపారు.